పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలి



చకిలం రమణయ్య

అబిడ్స్‌: తెలుగు యూనివర్సిటీకి మళ్లీ పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని తెలంగాణ రాష్ట్ర టింబర్‌ ఫెడరేషన్‌ అధ్యక్షుడు చకిలం రమణయ్య కోరారు. తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ..58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసిన స్వాతంత్ర సమరయోధుడు, గాంధేయవాది పొట్టి శ్రీరాములు పేరును 1985వ సంవత్సరంలో అప్పటి సీఎం ఎన్టీఆర్‌ నామకరణం చేస్తే ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి తొలగించడం దారుణమన్నారు. ఆర్యవైశ్యులంతా పార్టీలకతీతంగా ఏకమై కాంగ్రెస్‌ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ఎగ్జిబిషన్‌లో ఇఫ్తార్‌ విందు



పాల్గొన్న సురేందర్‌ రెడ్డి, ప్రభాశంకర్‌ తదితరులు

అబిడ్స్‌: ఎగ్జిబిషన్‌ సొసైటీలో శనివారం ఇఫ్తార్‌ విందు ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌ సొసైటీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కోశాధికారి ప్రభాశంకర్‌, ఇతర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పలువురు నాయకులు హాజరయ్యారు. శంకర్‌జీ సొసైటీ కార్యదర్శి ఫయీం తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి కాంగ్రెస్‌ ప్రభుత్వం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మల్లేశ్‌యాదవ్‌

గోల్కొండ: కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని గుడిమల్కాపూర్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ తలారి మల్లేశ్‌యాదవ్‌ అన్నారు. మార్కెట్‌ యార్డులో చలివేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుల కోసం మార్కెట్‌లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ కార్యాలయ సిబ్బంది కార్యదర్శి శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు.

అగ్రవర్ణ పేదలకు పథకం వర్తింపజేయాలి

యాకుత్‌పురా: అగ్రవర్ణ పేదలకు సైతం 'రాజీవ్‌ యువ వికాస్‌' పథకాన్ని వర్తింపజేయాలని తెలంగాణ న్యాయవాదులు జేఏసీ కన్వీనర్‌ పులిగారి గోవర్ధన్‌ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం సిటీ సివిల్‌ కోర్టు వద్ద ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారికి మాత్రమే ప్రభుత్వం పథకాన్ని వర్తింప చేయడం సరైంది కాదన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గౌలిపురా: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన భవానీనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం జరిగింది. ఎస్సై నరేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమన్‌నగర్‌–బీ రైల్వేస్టేషన్‌ ట్రాక్‌ వద్ద శనివారం పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న పోలీసులకు 30–35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా కనిపించాడు. దీంతో పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరె కటికలపై బీజేపీ వైఖరి బాధాకరం

రాజేంద్రనగర్‌: భారతీయ జనతా పార్టీ ఆరె కటికలపై వ్యవహరించిన తీరు బాధకరంగా ఉందని తెలంగాణ ఆరె కటిక విద్యావంతుల వేదిక అధ్యక్షుడు జి.వెంకటేశ్‌, ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్‌ ఆవేదన వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ... ఆరె కటికలకు బీజేపీ తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆరోపించారు. తమ కులానికి చెందిన జమాల్‌పూర్‌ చంద్రశేఖర్‌ 30 సంవత్సరాలుగా పార్టీకి సేవ చేస్తున్నారని గుర్తు చేశారు. భాగ్యనగర్‌ జిల్లా అధ్యక్షుడిగా రేసులో ఉండి ఒకే ఒక్కడు అధ్యక్ష పదవీ కోసం నామినేషన్‌ వేశారని తెలిపారు. ఏకగ్రీవంగా ఎంపిక కావాల్సిన చంద్రశేఖర్‌ను కేవలం కటిక కులస్తుడు కావడంతో పక్కకు తప్పించడం తమకు ఆందోళన కలిగించిందన్నారు. యాదవ కులస్తులు సైతం బీసీలని... తాము కూడా బీసీల కిందికే వస్తామన్నారు. భాగ్యనగర్‌ జిల్లా అధ్యక్ష పదవిని తమ కులస్తునికి ఇచ్చినట్లే ఇచ్చి మరొకరికి ఇవ్వడం దారుణమన్నారు. రాష్ట్రంలో తమ కులస్తులకు ఎక్కడా ప్రాతినిధ్యం లేదన్నారు. యాదవ కులస్తులకు పార్టీలో వివిధ హోదాల్లో ప్రాతినిధ్యం ఉందని వెల్లడించారు. భవిష్యత్తులో బీజేపీ ఆరె కటిక కులస్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని వేదిక ద్వారా కేంద్ర, రాష్ట్ర కమిటీలను కోరుతున్నామని వారు వెల్లడించారు.

అందుబాటులోకి పార్కింగ్‌ స్థలాలు!

- రంజాన్‌ నేపథ్యంలో ట్రాఫిక్‌ పోలీసుల చర్యలు
- పాతబస్తీలో 7 ప్రాంతాల్లో ఏర్పాటు
- డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు: నగర ట్రాఫిక్‌ డీసీపీ–3



రద్దీగా ఉన్న చార్మినార్‌ మార్కెట్‌ సముదాయం



పంచమొహల్లాలో ఏర్పాటు చేసిన పార్కింగ్‌

చార్మినార్‌: రంజాన్‌ మాసం చివరి దశకు చేరుకోవడంతో ట్రాఫిక్‌ పోలీసులు పాతబస్తీలో ముందస్తు చర్యలు చేపట్టారు. మార్కెట్లకు వినియోగదారులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో వాహనదారులకు ఇబ్బందుల్లేకుండా చార్మినార్‌ యునానీ ఆసుపత్రితో పాటు మరికొన్ని ప్రాంతాల్లో మొత్తం 7 పార్కింగ్‌ స్థలాలను ఏర్పాటు చేశారు. నగరం నుంచే కాకుండా శివారు జిల్లాల ప్రజలు కూడా పాతబస్తీలోని మార్కెట్లకు వస్తుండడంతో క్రమంగా వాహనాల రద్దీ పెరుగుతోంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మండలం ట్రాఫిక్‌ పోలీసులు చార్మినార్‌ పరిసరాల్లో వాహనదారులకు పార్కింగ్‌ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.మరోవైపు మక్కా మసీదులో నమాజ్‌లకు ముస్లింలు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారి వాహనాలు పార్క్‌ చేసేందుకు పంచమొహల్లాలో పార్కింగ్‌కు అవకాశం కల్పించారు. అలాగే కూలగొట్టిన చార్మినార్‌ ఆర్టీసీ బస్టాండ్‌ స్థలాన్ని శుభ్రం చేసి అందుబాటులోకి తెచ్చారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పార్కింగ్‌ స్థలాలు ..

- కోట్ల అలీజాలోని ముఫీద్‌–ఉల్‌–ఆనం గ్రౌండ్‌
- చార్మినార్‌ బస్‌ టెర్మినల్‌
- చార్మినార్‌ ఆయుర్వేదిక్‌ యునానీ ఆసుపత్రి ప్రాంగణం
- ఖిల్వత్‌ గ్రౌండ్‌
- మోతీగల్లీలోని పాత పింఛన్‌ పెమెంట్‌ కార్యాలయ ఖాళీ స్థలం
- ఖులీ ఖుతుబ్‌ షా స్టేడియం
- ప్రభుత్వ సిటీ కాలేజీ

డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు



రంజాన్‌ నేపథ్యంలో పాతబస్తీకి సందర్శకులతో పాటు వినియోగదారుల సందడి అధికంగా ఉంటోంది. దీంతో వాహనదారుల సౌకర్యార్థం పంచమొహల్లాలో అతి పెద్ద ఖాళీ స్థలాన్ని పార్కింగ్‌ కోసం ఏర్పాటు చేశాం. అలాగే ఖిల్వత్‌ గ్రౌండ్‌, కుడా స్టేడియం, చౌక్‌మైదాన్‌ ఖాన్‌లోని ముఫిదుల్లా నాం ఖాళీ స్థలాలతో పాటు యునానీ ఆసుపత్రి ప్రాంగణాన్ని అందుబాటులోకి తీసుకువచ్చాం. ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా పార్కింగ్‌ చేసుకోవచ్చు. ఎవరైనా అక్రమంగా పార్కింగ్‌ల వద్ద డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

–ఆర్‌.వెంకటేశ్వర్లు, నగర ట్రాఫిక్‌ డీసీపీ–3

కనుల పండువగా నృత్య నీరాజనం



నాంపల్లి: భరత కళా ప్రపూర్ణ పద్మశ్రీ డాక్టర్‌ నటరాజ రామకృష్ణ 102వ జయంతి, స్వర నర్తన సంస్థ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో శనివారం రాత్రి ప్రదర్శించిన నృత్య నీరాజనం కనుల పండువగా జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు దెందులూరి పద్మ మోహన్‌, కర్నాటి నవత సంయుక్త నిర్వహణలో ఐఎఫ్‌ఎస్‌ అధికారి దెందులూరి నళిని మోహన్‌ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి నృత్య నీరాజన ప్రదర్శనను ప్రారంభించి ప్రాచీన నృత్య కళల పరిరక్షణకు పాటుపడుతున్న నృత్య గురువులు, సంస్థలను అభినందించారు. అనంతరం ప్రదర్శనకు సాంకేతిక సహకారం అందించిన వాయిద్యా బృందం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ హరికథ భాగవతారిణి పద్మశ్రీ ఉమా మహేశ్వరి వ్యాఖ్యతగా వ్యవహరించారు. ప్రముఖ కూచిపూడి నాట్య గురువులు డాక్టర్‌ భాగవతుల సేతూరామ్‌, ప్రముఖ కథక్‌ నాట్య గురువులు అంజిబాబు, గురువు కళాకృష్ణ, స్వర నర్తన సంస్థ వ్యవస్థాపకురాలు పద్మా మోహన్‌, స్వర్ణ నర్తన సంస్థ సభ్యులు సునీల, స్రవంతి, సంధ్య, పవన్‌, కల్పన, మహతి, సాయి, ధర్మ, శ్రీనర్తన, నిఖిత, సాయి, సంతోష్‌ పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు సన్మానం

చార్మినార్‌ : బీసీ కులగణన, 42 శాతం రిజర్వేషన్‌, ఎస్సీ వర్గీకరణ బిల్లులు అసెంబ్లీలో ఆమోదం పొందడంపై పాతబస్తీ కాంగ్రెస్‌ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బహదూర్‌ పురా, చార్మినార్‌, చాంద్రాయణ గుట్ట, యాకుత్‌ పురా నియోజకవర్గాల కాంగ్రెస్‌ ఇన్‌చార్జిలు పులిపాటి రాజేశ్‌ కుమార్‌, ముజీబ్‌ ఉల్లా షరీఫ్‌, నగేశ్‌, రవి రాజ్‌ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం కలిశారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రాజేశ్‌ కుమార్‌ మాట్లాడుతూ.. బిల్లులకు మద్దతు తెలిపిన మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌ కుమార్‌ గౌడ్‌, బీసీ కమిషన్‌ చైర్మన్‌ నిరంజన్‌ తో పాటు ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు.

ట్రాఫిక్‌ ఆంక్షలతో ఉపాధి దూరం

చార్మినార్‌: ట్రాఫిక్‌ పోలీసుల ఆంక్షలతో తాము జీవనోపాధి కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయని పాతబస్తీకి చెందిన పలువురు రిక్షా కార్మికులు శనివారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పటేల్‌ మార్కెట్‌, రికాబ్‌ గంజ్‌, మదీనా మార్కెట్‌, ఉర్దూ గల్లీ, ఘాన్సీ బజార్‌ తదితర ప్రాంతాల్లోని మార్కెట్లకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నా.. తమకు మాత్రం మదీనా చౌరస్తా నుంచి దివాన్‌ దేవుడిలోని మార్కెట్‌ కు వెళ్లేందుకు అనుమతించకపోవడంతో గిరాకీ దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమపై విధించిన ఆంక్షలను వెంటనే తొలగించాలని వారు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బీజేపీ హైదరాబాద్‌ సెంట్రల్‌ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని బీజేపీ హైదరాబాద్‌ సెంట్రల్‌ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి సూచించారు. మెహిదీపట్నంలోని ఓ కమిటీ హాల్‌లో శుక్రవారం రాత్రి పార్టీ డివిజన్‌ అధ్యక్షుడు చింతల రాజేశ్‌ ఆధ్వర్యంలో నూతన కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. దీపక్‌ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. బూత్‌ స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలన్నారు. అలాగే పార్టీ పథకాలను ప్రజలకు వివరించాలని కమిటీ సభ్యులు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్‌ గౌతంరావు, సాయి సందీప్‌, రాహుల్‌ చంద్ర, కొల్లూరు పవన్‌కుమార్‌,బుజేందర్‌, సుమంత్‌, బాబురావు, ధనరాజ్‌, వేణుగోపాల్‌, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గేట్‌ ఫలితాల్లో జీఎన్‌ఐటీఎస్‌ విద్యార్థిని ప్రతిభ



జి.శివతేజస్వీని

గోల్కొండ: ఇటీవల విడుదలైన గేట్‌ ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థిని జి.శివతేజస్వీని జాతీయ స్థాయిలో 506 ర్యాంకు సాధించిందని షేక్‌పేట్‌ జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్‌ కళాశాల వైస్‌ చైర్‌పర్సన్‌ జి.శ్రీవిద్యారెడ్డి తెలిపారు. అంతేగాకుండా క్యాంపస్‌ రిక్రూట్‌మెంట్‌లు, వివిధ విశ్వవిద్యాలయాల వారు నిర్వహించే పోటీ పరీక్షల్లో సైతం ర్యాంకులు సాధించి సీట్లు పొందుతున్నారని పేర్కొన్నారు.

రక్తదాన శిబిరానికి రావాలంటూ స్పీకర్‌కు ఆహ్వానం



స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌ను కలిసిన టీఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్‌ తదితరులు

అబిడ్స్‌: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే రక్తదాన శిబిరానికి హాజరు కావాలని రాష్ట్ర శాసన సభ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌ను టీఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం.ముజీబ్‌ హుస్సేనీలు ఆహ్వానించారు. ప్రసాద్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో ప్రత్యేకంగా కలిసి ఏప్రిల్‌ మాసంలో అంబేడ్కర్‌ జయంతి సందర్భంగా టీఎన్జీఓ సంఘం ఏర్పాటు చేస్తున్న రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించాలని ఆహ్వానించారు. అనంతరం ఉద్యోగుల సమస్యల మీద సుదీర్ఘంగా చర్చించారు. స్పందించిన స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌ త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు జగదీశ్వర్‌ తెలిపారు. ఇందుకు టీఎన్జీఓ కేంద్ర సంఘం తరపున కృతజ్ఞతలు తెలుతున్నామన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అభినేత్రి ఆర్ట్స్‌ అకాడమీ ఆధ్వర్యంలో నాట్య ప్రవాహ పేరిట శనివారం రవీంద్రభారతిలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గణపతి కవుత్వం, ఆనంద తాండవం, మూషిక వాహన, స్వరజతి, రామాయణ శబ్దం వంటి పలు అంశాలపై సంస్థకు చెందిన 80 మంది విద్యార్థులు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ నాట్య గురువు డాక్టర్‌ నిర్మలా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే యువతకు శాస్త్రీయ సంగీత కళలపై అభిరుచిని కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం నృత్య కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సినీ నటుడు వినోద్‌కుమార్‌, నాట్య గురువులు కోకా విజయలక్ష్మి, జి.రవి, ఎస్‌.లక్ష్మి, అభినేత్రి ఆర్ట్స్‌ అకాడమీ వ్యవస్థాపకుడు ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌ విందుతో మత సామరస్యం



గోల్కొండ: ఇఫ్తార్‌ విందులు మత సామరస్యాన్ని పెంపొందిస్తాయని సౌత్‌ వెస్ట్‌జోన్‌ డీసీపీ చంద్రమోహన్‌ అన్నారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్‌ సైదులు ఆధ్వర్యంలో గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఇఫ్తార్‌ విందు ఏర్పాటు చేశారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పండుగల సందర్భంగా శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీసులు స్థానికులతో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గోల్కొండ డివిజన్‌ ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌, జీఎంకే గ్రూప్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ గులామ్‌ మోహియుద్దీన్‌, పాషాభాయ్‌, పీస్‌ కమిటీ అధ్యక్షుడు ఎస్‌.రాజువస్తాద్‌, ఆబేద్‌, అక్బర్‌ తదితరులు ఉన్నారు.

నిజాం కళాశాల విద్యార్థుల ఆందోళన

గన్‌ఫౌండ్రీ: నిజాం కళాశాల బాలుర వసతి గృహం మెస్‌ అపరిశుభ్రంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థులు శనివారం హాస్టల్‌ ఎదుట కూర్చొని భోజనాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా సిబ్బందికి జీతాలు చెల్లించకపోవడంతో వారు హాస్టల్‌ను శుభ్రం చేయకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి తాము అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కళాశాల యాజమాన్యం స్పందించి సమస్య పరిష్కరించాలని లేకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.



అగ్నివీర్‌తో ఉద్యోగంతో పాటు దేశ సేవ



సావనీర్‌ విడుదల చేస్తున్న ఆర్మీ అధికారి ప్రకాశ్‌ చంద్రరాయ్‌, ప్రిన్సిపాల్‌ చంద్రశేఖర్‌

విజయనగర్‌కాలనీ: అగ్నివీర్‌ ద్వారా ఉద్యోగావకాశాలు పొందడంతో పాటు దేశ సేవ చేసే అవకాశం ఉంటుందని ఆర్మీ రిక్రూట్‌మెంట్‌ ఆఫీసర్‌ మేజర్‌ డాక్టర్‌ ప్రకాశ్‌ చంద్రరాయ్‌, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ చంద్రశేఖర్‌ అన్నారు. మాసబ్‌ట్యాంక్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల ఆవరణలోని ఆడిటోరియం హాల్‌లో ఆర్మీ రిక్రూట్‌మెంట్‌, డైరెక్టర్‌ జనరల్‌ ఆఫ్‌ రిక్రూట్‌మెంట్‌ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులు, పాలిటెక్నిక్‌ విద్యార్థులకు అగ్నివీర్‌ రిక్రూట్‌మెంట్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపికైన అభ్యర్థులు 25 శాతం పర్మనెంట్‌ ఆర్మీ ఉద్యోగులుగా కొనసాగే అవకాశం ఉంటుందన్నారు. అంతేగాకుండా అగ్నివీర్‌లో సేవలందించి బయటకు వచ్చినవారు కూడా క్రమశిక్షణ, నియమనిబద్ధతతో ఎలాంటి సమస్యలనైనా దీటుగా ఎదుర్కొని ముందుకు సాగుతారన్నారు. అగ్నివీర్‌ ప్రాధాన్యత, ఎంపిక విధానాన్ని ఆర్మీ అధికారి పవర్‌పాయింట్‌ ప్రజంటేషన్‌ ద్వారా ఎన్‌సీసీ కెడెట్లకు, విద్యార్థులకు వివరించారు. ఈ నెల 12 నుంచి ఏప్రిల్‌ 10 లోగా www.ojinindiaarmy.nic.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమానికి హాజరైన ఎన్‌సీసీ విద్యార్థులు

గోల్కొండలో 'జల్సా ఏ ఖీరత్‌ వార్షిక' కార్యక్రమం



మాట్లాడుతున్న సయ్యద్‌ ఖారీ మతీన్‌ ఆలీషా ఖాద్రీ

గోల్కొండ: గోల్కొండ ఒవైసీ ఫుట్‌బాల్‌ గ్రౌండ్‌లో 'జల్సా ఏ ఖీరత్‌ వార్షిక' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి ఖారీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆల్‌ ఇండియా ఖీరత్‌ కమిటీ అధ్యక్షుడు మౌలానా ఖారీ సయ్యద్‌ మతీన్‌ ఆలీషా ఖాద్రీ రంజాన్‌ మాసం ప్రత్యేకతలు, దివ్య ఖురాన్‌ అవతరణ, ప్రవక్త మహ్మద్‌ పోరాటాలను వివరించారు. రంజాన్‌ మాసంలో రాత్రి పూట జరిగే తరావీ ప్రార్థనలు ఖురాన్‌ గ్రంథ పఠనానికి నిదర్శనమన్నారు. నేటి యువత దివ్య ఖురాన్‌ గ్రంథ పఠనాన్ని మరిచిందన్నారు. వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్వాన్‌ ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌, గోల్కొండ డివిజన్‌ ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌తో పాటు పీర్‌ సయ్యద్‌ షబ్బీర్‌ నక్షబందీ ఇక్తేకారీ, మౌలానా సయ్యద్‌ జహీర్‌ ఆలీ సోఫీ తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



స్థానికులతో గోల్కొండ ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌

గోల్కొండ: శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని గోల్కొండ డివిజన్‌ ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌ కోరారు. గోల్కొండ సౌత్‌ వెస్ట్‌ ఫ్రెండ్స్‌ కమిటీ సభ్యులు శనివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్నివర్గాల వారు తమ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్‌ బి.సైదులు, జంగయ్య, ఇమ్రాన్‌ ఆలీఖాన్‌, ఇమ్రాన్‌, షెబాజ్‌ తదితరులు ఉన్నారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ తనిఖీలు

గోల్కొండ: గోషామహల్‌ ట్రాఫిక్‌ ఏసీపీ ధనలక్ష్మి ఆధ్వర్యంలో టోలిచౌకీ ట్రాఫిక్‌ పోలీసులు టోలిచౌకీ, షేక్‌పేట్‌ నాలా తదితర ప్రాంతాల్లో శనివారం డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులను బ్రీత్‌ఎనలైజర్‌తో పరీక్షించారు. మద్యం తాగి వాహనాలు నడిపిస్తే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్‌ ఏసీపీ ధనలక్ష్మి హెచ్చరించారు. తనిఖీల్లో ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌. సుధాకర్‌, ఎస్సైలు తదితరులు ఉన్నారు.



షేక్‌పేట్‌ వద్ద డ్రైవ్‌ నిర్వహిస్తున్న ట్రాఫిక్‌ పోలీసులు

ఆర్యవైశ్య సంఘం ప్రత్యేక సమావేశం



నూతన అధ్యక్షుడు శ్రీరాం కోటయ్యను సన్మానిస్తున్న సభ్యులు

గౌలిపురా: ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని గౌలిపురా బతుకమ్మ బావి వద్ద గురువారం రాత్రి నిర్వహించారు. సంఘం మాజీ అధ్యక్షుడితో పాటు 132 మంది సభ్యులు హాజరయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడు సరాబు సంతోష్‌ గుప్తా సంఘానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడని అతడిని తొలగించి నూతన అధ్యక్షుడిగా శ్రీరాం కోటయ్య గుప్తాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి అందరి సహాయ సహకారాలతో ముందుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్‌ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు సరాబు లక్ష్మణ్‌ గుప్తా, సంఘం నూతన అధ్యక్షుడు శ్రీరాం కోటయ్య, ఉపాధ్యక్షుడు ఇరుకుళ్ల భిక్షపతి గుప్తా, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌ గుప్తా, జనరల్‌ సెక్రటరీ బుచ్చయ్య గుప్తా, కోశాధికారి వెంకటేశ్‌ గుప్తా, అడిషనల్‌ కోశాధికారి శ్రీనివాస్‌ గుప్తా, సెక్రటరీ చంద్రశేఖర్‌ గుప్తా, ఐపీపీ మల్లికార్జున్‌ గుప్తా, పీఆర్‌ఓ ఉదయ్‌ భాస్కర్‌ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ భాగ్యలక్ష్మి

గౌలిపురా: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని గౌలిపురా డివిజన్‌ కార్పొరేటర్‌ ఆలె భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. పటేల్‌నగర్‌ కమ్యూనిటీ హాల్‌లో తాండూర్‌ బండల ఫ్లోరింగ్‌ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.5.60 లక్షల జీహెచ్‌ఎంసీ నిధులతో పనులు చేపట్టామన్నారు. గౌలిపురా ఏఈ తేజోవంత్‌, గౌలిపురా డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు సుమన్‌ కుమార్‌ ముదిరాజ్‌, నాయకులు జి.రఘుకాంత్‌, కె.రాజ్‌ కుమార్‌, డి.ప్రవీణ్‌ కుమార్‌, సునీల్‌, బస్తీవాసులు డి.శ్రీనివాస్‌, శ్రీధర్‌, శ్రీనివాస్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు రూప, కేశ అలంకరణ ముఖ్యం



బొమ్మ సుదర్శన్‌ను సత్కరిస్తున్న వసుంధర



వర్క్‌షాప్‌లో పాల్గొన్న యువ కళాకారులు

సుల్తాన్‌బజార్‌: కళాకారులకు రూపాలంకారణ, కేశాలంకరణ ఎంతో ముఖ్యమని రాష్ట్ర ఖజాన, లెక్కల శాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర అన్నారు. సుల్తాన్‌బజార్‌లోని కృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలో నవ్య నాటక సమితి 2 రోజుల పాటు నిర్వహిస్తున్న 'రూపసజ్జ' రూపాలంకరణ కార్యశాల వర్క్‌షాప్‌కు శనివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నృత్య ప్రదర్శన రక్తి కట్టాలంటే సరైన ఆహార్యం, రూపాలంకరణ చాలా అవసరమన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న యువ కళాకారులందరూ భవిష్యత్తులో గొప్ప కళాకారులుగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌ నిర్వహిస్తున్న సుదర్శన్‌ను సంస్థ పక్షాన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ నృత్య గురువులు నిష్టల సుధామాల, మధుమతి కులకర్ణి సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్‌, శర్మ, కన్నారావు పాల్గొన్నారు.